TGTEL/26/A4015

# తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 13, ఆదివారం, సెప్టెంబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 128 తెలుగువారి పత్రిక..... మీ కోసం

## యూట్యూబర్ రమానందనపై మరో కేసు

చీటింగ్ కేసులో యూట్యూబర్ రమానందనకు నోటీసులు

లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10.50 లక్షలు వసూలు

ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశం

గతంలోనూ నందనపై పలు మోసం కేసులు

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందనకు ప్రకాశం జిల్లా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. తన యూట్యూబ్ ఛానల్ 'నందూస్ వరల్డ్' ద్వారా నందన తెలుగు ప్రజలకు సుపరిచితురాలు.



## ఖైరతాబాద్ వినాయకుడు..

**నేటి నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

- భక్తుల దర్శనానికి సిద్ధమవుతున్న ఖైరతాబాద్ వినాయకుడు
- భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ ఆంక్షలు
- ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు భక్తులు సహకరించాలని కోరిన పోలీసులు

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

హైదరాబాద్‌లో అత్యంత ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ బడా గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ కీలక ఆంక్షలు ప్రకటించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 12వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

మిగతా 2 లో

## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం..

### కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

వెంటనే రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం

కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం

సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.

## మిల్లా మ్యాగీ ఆరోపణలతో గతంలో రాజకీయ దుమారం

- బీఆర్ఎస్ నేతలపై కేసులు.. మరి మిస్ ఇంగ్లాండ్ వ్యవహారం ఏమైంది?: కేటీఆర్
- బీఆర్ఎస్ నేతలపై కేసులపై కేటీఆర్ స్పందన
- కేసులను కోర్టుల్లో ఎదుర్కొంటామని వెల్లడి
- మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై డీజీపీకి ప్రశ్న
- తెలంగాణ పోలీసులు నిందితులను కాపాడుతున్నారా? అని నిలదీత

02

అసెంబ్లీ ప్రాంగణంలో ఇటీవల జరిగిన గందరగోళం నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని చెప్పారు. అయితే హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు.

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

**: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

- బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో లక్షల ఎకరాల అక్రమాలు
- ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు
- దివాలా తీసిన విదేశీ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు
- బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ నేతలు పారిపోతున్నారు
- పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

**అసెంబ్లీలో మంత్రి తీవ్ర ఆగ్రహం**

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- గణేశ్ ఉత్సవాలపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- మండపాల నిర్వహకులు పోలీస్ స్టేషన్లలో సమాచారం ఇవ్వాలని సూచన
- నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశం

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు 12

వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## వినాయక చవితి వేళ ఆర్టీసీ 'బాదుడు'..

### 40% పెరిగిన టికెట్ ధరలు!

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా బాదుడు మొదలుపెట్టింది. వినాయక చవితి సందర్భంగా టికెట్ ధరలను దాదాపు 40 శాతం పెంచేసిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వినాయక చవితి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో బస్సులకు డిమాండ్ పెరగడంతో టికెట్ ధర కూడా పెరిగిందంటూ ఓ ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి హన్మకొండ వెళ్లే ఏసీ బస్సు టికెట్ సాధారణంగా రూ.410 ఉంటుందని, అయితే పండుగ సందర్భంగా అదే ప్రయాణానికి రూ.570 వసూలు చేశారని ఓ ప్రయాణికుడు పేర్కొన్నాడు. అంటే ఒక్క టికెట్‌పై రూ.160 అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.నగర పర్యటనలను అన్వేషించండి తనకు అందిన టికెట్‌ను చూపిస్తూ సాధారణంగా ఉండే చార్జీతో పోలిస్తే దాదాపు 39 శాతం అదనంగా వసూలు చేశారని ఆయన ఆరోపించారు. ప్రతిసారి ఇలా పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ చార్జీలను భారీగా పెంచడంపై ప్రజలు మండిపడుతున్నారు.

## యూట్యూబర్ రమానందనపై మరో కేసు

మొదటిపేజీ తరువాయి

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం పేరాయపాలెంకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కోడలికి లండన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, నందన తమ నుంచి రూ.10.50 లక్షలు వసూలు చేశారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో చాలా మందికి ఉద్యోగాలు ఇప్పించానని చెప్పడంతో విడతల వారీగా ఈ మొత్తాన్ని ఆమెకు బదిలీ చేసినట్లు తెలిపారు. అయితే, ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో జులై 4న పోలీసులు నందనపై చీటింగ్ కేసు నమోదు చేశారు.నందనపై ఇలాంటి ఆరోపణలు రావడం ఇది మొదటిసారి కాదు. యూకేలో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు గతంలో ఎన్టీఆర్ జిల్లాలోనూ ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి జారీ అయిన లుక్‌అవుట్ నోటీసుల కారణంగా ఇటీవల హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆమెను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ మోసాలతో తనకు సంబంధం లేదని, తన భర్తే ఇలాంటి వ్యవహారాలు చూసుకుంటారని విచారణ సందర్భంగా ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఖైరతాబాద్ వినాయకుడు..

### నేటి నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు

**ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు వివరాలు:**

రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్: పీవీ విగ్రహం వైపు నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్‌కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్ వైపు మళ్లిస్తారు.

**రాజ్‌దూత్ లేన్:** రాజ్‌దూత్ లేన్ మీదుగా బడా గణేశ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఇక్బాల్ మినార్ వైపు పంపిస్తారు.

**మింట్ కాంపౌండ్:** మింట్ కాంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపు వెళ్లే వాహనాలను మింట్ కాంపౌండ్ లైన్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు, మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను నెక్లెస్ రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు మళ్లిస్తారు.

**ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ దారి:** ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ లేన్ మీదుగా రైల్వేగేటు వైపు వెళ్లే వాహనాలను పోస్ట్‌ఆఫీసు జంక్షన్ వద్ద పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ జంక్షన్ వైపు పంపిస్తారు.

**భక్తుల వాహనాలకు కేటాయించిన పార్కింగ్ స్థలాలు:**

నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను రేస్ కోర్సు రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలంతో పాటు ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను విశ్వేశ్వరయ్య భవన్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. గణేశ్ నిమజ్జన ఉత్సవాలు పూర్తయ్యే వరకు వాహనదారులు, భక్తులు ఈ ఆంక్షలకు సహకరించాలని కోరారు.

## మిల్లా మ్యాగీ ఆరోపణలతో గతంలో రాజకీయ దుమారం

మొదటిపేజీ తరువాయి

"ఈ చెత్త కేసును మేం కోర్టుల్లో ఎదుర్కొంటాం. కానీ హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సమయంలో మిస్ ఇంగ్లాండ్‌తో అభ్యంతరకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై ఆమె చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు. నిందితులను తెలంగాణ పోలీసులు ఇంకా కాపాడుతున్నారా? దీనిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ వద్ద సమాధానం ఉందా? అని నిలదీశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.అసెంబ్లీ గేటు ముందు జరిగిన గందరగోళం నేపథ్యంలో ముఖ్యమంత్రి తన పోలీసులతో బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని కేటీఆర్ ఆరోపించారు.2025లో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీలపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై ఆరోపించారు. "మేం పోటీలకు వచ్చామో, దేనికి వచ్చామో అర్థం కాలేదు. ఇవేం పోటీలు?" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.తనకు ఎదురైన అసౌకర్యంతో మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి మ్యాగీ అర్ధాంతరంగా వైదొలిగి ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయారు. స్వదేశానికి చేరుకున్న తర్వాత ఆమె చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో రాజకీయ దుమారానికి దారితీశాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాగీ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం సైతం సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.

మొదటిపేజీ తరువాయి

## తప్పిన పెను ప్రమాదం

చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయినప్పటికీ అప్పటికే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులు లేని సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ముప్పు తప్పినట్లయిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదన్న మోదీ

### 10 పాయింట్లతో రోడ్‌మ్యాప్ ప్రకటన

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు 12

బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు ప్రారంభం సందర్భంగా మోదీ మాట్లాడారు. బ్రిక్స్ సదస్సు ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బ్రిక్స్ కూటమి విషయంలో యూరప్ దేశాలకు ఉన్న సందేహాలపై మోదీ ఈ విధంగా సమాధానమిచ్చారు. గ్లోబల్ సౌత్ (దక్షిణ ప్రాంతపు దేశాలు) రూల్స్ రూపొందించే శక్తిగా ఎదగాలి.ఐక్యరాజ్యసమితిలోనూ సవరణలు అవసరం. అన్ని దేశాలకు భాగస్వామ్యం కావాలి. అన్ని దేశాలు తమ గొంతుక వినిపించాలి. బ్రిక్స్‌ను బలోపేతం చేస్తూనే ప్రపంచస్థాయి సంస్కరణల కోసం ఒక మార్గాన్ని రూపొందించాలి. ప్రస్తుతం ఉన్న ప్రపంచ వ్యవస్థ ఒక పిరమిడ్‌లాగా ఉంది. అధికారం, బలం, ఆదిపత్యం, నిర్ణయాలు తీసుకునేవన్నీ పైన ఉండే దేశాలు. కింద ఉండే దేశాలు వీటివల్ల ప్రభావితం అవుతున్నాయి. అవి తమను తాము సొంతంగా నిర్మించుకోలేక పోతున్నాయి.

## ధరణి పేరుతో బీఆర్ఎస్ భూదందా

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని లక్షలాది ఎకరాల భూములను ఆక్రమించిందని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం శాసనసభలో 22-ఏ నిషేధిత భూములపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూ అక్రమాలకు పాల్పడ్డారని పొంగులేటి విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత ప్రభుత్వం పాలన సాగించిందని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని, పోర్టల్‌పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి వేళల్లో రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు.పోర్టల్‌లోని సాంకేతిక లోపాల వల్ల లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బంధువులు మాత్రమే లబ్ధి పొందారని, సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. శాసనసభ సాక్షిగా తమ అక్రమాలు బయటపడుతుండటంతోనే గత పాలకులు చర్చ నుంచి పారిపోతున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు. భూ పరిపాలన, ధరణి పోర్టల్ అంశాలపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## కేరళంలోని త్రిప్రయార్ శ్రీరామస్వామిని దర్శించుకున్న పవన్ కల్యాణ్

- త్రిప్రయార్ ఆలయంలో దీపారాధన సేవలో పాల్గొన్న పవన్
- మీనుట్టు, వేది వజిపాడు కార్యక్రమాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం
- సంధ్యాకాల అర్చనలను నిర్వహించిన పవన్

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేరళంలోని అత్యంత పురాతన, సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రమైన త్రిప్రయార్ శ్రీ రామస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం ఆయుర్వేద చికిత్స నిమిత్తం కేరళంలో ఉన్న ఆయన... ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎంతో విశిష్టమైనదిగా భావించే 'దీపారాధన' సేవలో పవన్ పాల్గొన్నారు. ఒక్కరోజు దీపారాధన సేవకు విరాళం అందించారు. ఆలయ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ మందిరంలోని ప్రధాన దీపాలను వెలిగించారు.

### విశాఖలో కాలిబూడిదైన ఆర్టీసీ బస్సు..

## తప్పిన పెను ప్రమాదం

విశాఖ వాల్తేరు డిపో సమీపంలో ఘటన

నెల్లూరు నుంచి వచ్చిన బస్సులో అకస్మాత్తుగా మంటలు

ఇంజిన్‌లో మొదలై నిమిషాల్లోనే వ్యాపించిన అగ్నికీలలు

ప్రయాణికులు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

విశాఖపట్నంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నగరంలోని వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి నెల్లూరు నుంచి ప్రయాణికులతో వచ్చిన ఈ బస్సును వాల్తేరు డిపో వద్ద నిలిపి ఉంచారు. అయితే, శనివారం తెల్లవారుజామున బస్సు ఇంజిన్ భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడ్డాయి.

## 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నాం..

### కానీ ఏ 100 రోజుల్లో చెప్పామా?

### : మాక్ అసెంబ్లీలో సీఎం తలసాని వ్యాఖ్యలు

తెలంగాణ మంజీరా, సెప్టెంబరు12

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్ర పోషించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు శాసన సభ స్పీకర్‌గా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ సభ్యులు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీఎం పాత్ర పోషించిన తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, హామీల అమలుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పామని, అయితే ఏ 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పలేదంటూ తలసాని వ్యాఖ్యానించారు."మేము 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని అన్నాం.. కానీ ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఐదేళ్లు కాదు.. 25 ఏళ్లు మేమే ఉంటాం. ఎప్పుడో ఒకప్పుడు హామీలు అమలు చేస్తాం" అంటూ మాక్ అసెంబ్లీలో తలసాని వ్యంగ్యంగా మాట్లాడారు. సభలో సభ్యులు సబ్జెక్ట్ తప్ప ఏమైనా మాట్లాడుకోవాలని సూచించారు. "నాకు చాలా సమస్యలు ఉన్నాయి. ఢిల్లీతో సమస్య, పార్టీలో సమస్య.. ఆఖరికి బీఆర్ఎస్‌తో కూడా ప్రశాంతత లేదు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు.ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఒకటైన కాళేశ్వరం ప్రాజెక్టును ఇందిరాగాంధీ నిర్మించారని చెప్పడం ద్వారా తలసాని శ్రీనివాస్ సభలో నవ్వులు పూయించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు.

# జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం..!

## జిల్లా సేవాదికార సంస్థ భవానీ చంద్ర

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్**

సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం 3వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కమ్ చైర్‌పర్సన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జి. భవాని చంద్ర ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ జడ్జి జి. భవాని చంద్ర, సభను ఉద్దేశించి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు తమ వివాదాలను పరస్పర అంగీకారంతో సత్వరంగా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. 1వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. జయంతి కూడా ఈ కార్యక్రమంలో సభను ఉద్దేశించి ప్రసంగించారు. లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలు తమ మధ్య ఉన్న రాజీ పడదగిన వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్‌లు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆమె తెలిపారు.లోక్ అదాలత్‌లో వివిధ రకాల సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాద పరిహారం, కుటుంబ వివాదాలు, ఇతర రాజీ పడదగిన కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిష్కరించబడిన కేసులకు సంబంధించి కక్షిదారులకు అవార్డులను అందజేశారు. అవార్డులు అందుకున్న కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా తమ కేసులు సత్వరంగా పరిష్కారం కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం మరియు న్యాయ వ్యయం ఆదా కావడంతో పాటు, దీర్ఘకాలిక న్యాయ వివాదాలకు ముగింపు పలికి ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని న్యాయమూర్తులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందించడం, ప్రజలకు సత్వర న్యాయం అందించడం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసుల వివరాలు క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు 3050, సివిల్ కేసులు 24, మోటారు వాహన ప్రమాద పరిహారం కేసులు 15 , రూ. 1,56,85,000లు, బ్యాంకు రికవరీ కేసులు 230 , రూ.2,77,0216లు, సైబర్ క్రైమ్ కేసులు 70 కేసులు, రూ.3,37,606లు, ఎలక్ట్రిసిటీ కేసులు 236లు మొత్తం పరిష్కరించబడిన కేసులు 3625లు, ఈ కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. జయంతి, 3వ అదనపు జిల్లా ఒ సెషన్స్ జడ్జి డి. మాధవి కృష్ణ, 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి సతీష్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజు కార్తీక్, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. ధనలక్ష్మి, ప్రత్యేక మొబైల్ కోర్టు న్యాయమూర్తి టి. దుర్గా రాణి, ప్రత్యేక ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి అమిసి జాజియాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సంజీవ రెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ జి. ప్రభు ధాన్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, ఆందోల్ ఆర్డీఓ రాజు, పాల్గొన్నారు.అదేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణేష్ ను పూజిద్దాం.. పర్యావరణం కాపాడుదాం..

**నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

నర్సాపూర్ సిఐ రంగ కృష్ణ, యస్.ఐ. రంజిత్ కుమార్ చేతుల మీదుగా మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ రానున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి పర్వదినం సమీపిస్తున్న సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా గిరిదీపం ప్రైవేట్ హై స్కూల్ 125 మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, కరస్పాండెంట్ ప్రవీణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ మోసిన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రంగ కృష్ణ, ఆధ్వర్యంలో, పర్యావరణం ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. అనంతరం 101 చిన్న మట్టి గణేష్ విగ్రహాలు విద్యార్థులకు అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్, పర్యావరణానికి హానికరమైన పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కావడంతో పాటు పర్యావరణానికి నష్టం జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు పర్యావరణహితమైన మట్టి గణేష్ విగ్రహాలను ఉపయోగించి వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జరుపుకోవాలని సూచించారు. మట్టి గణేష్ ను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువత లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరగడమే కాక, సమాజంలో పర్యావరణ హితమైన వినాయక చవితి నిర్వహణకు ప్రోత్సాహం లభిస్తుందని పోలీసులు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల స్పందన.. !

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :**

ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేసినందుకు ఉద్యోగుల సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణా రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మాన్యశ్రీడాక్టర్ మల్లు రవి నాయకులకుకు ట్రేసా నాయకులకు ఎంపీ డాక్టర్ మల్లు రవి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చలు సఫలమై, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో టిజిఇజెఏ నాయకులు ధర్నాను వాయిదా వేసిన సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మాన్యశ్రీ డాక్టర్ మల్లు రవి టిఎన్ జివోస్ భవన్‌కు వెళ్లి టిజిఇజెఏసి ఛైర్మెన్ మారం జగదీశ్వర్ ఎన్జీవో జనరల్ సెక్రెటరీ ముజీబ్ ఇతర జాక్ నాయకులను కలిసి ధర్నా విరమించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమని డాక్టర్ మల్లు రవి తెలిపారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని డాక్టర్ మల్లు రవి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తను తప్పకుండా కృషి చేస్తానని జేఈసీ నాయకులకుడాక్టర్ మల్లు రవి హామీ ఇచ్చారు. తెలంగాణ ఎంప్లాయిన్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, డాక్టర్ మల్లురవికి శాలువా కప్పి సన్మానించారు.

# మట్టి గణపతుల పంపిణీ

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్**

మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణ ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. మట్టి గణపతులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు, గణపతి నిమజ్జనం అనంతరం చెరువుల్లోని జలచరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందని తెలిపారు. ప్రజలందరూ పర్యావరణహితంగా వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని , అన్నదానం కార్యక్రమం లలో బదులు ఇస్తారాకు, లేదా స్టీల్ ప్లేట్స్ వాడుకోవాలని మున్సిపల్ కమీషనర్ కోరారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ విజయలక్ష్మి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు ప్రోటీన్ కిట్లు.. పంపిణి

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**నర్సాపూర్/ శివంపేట తెలంగాణ మంజీరా న్యూస్**

శివ్వంపేట మండల కేంద్రంలో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 125 మంది గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని గర్భిణీలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషకాహారం అందించడం ద్వారా తల్లులు, శిశువుల ఆరోగ్యాన్ని మెరుగు పర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.శాసనసభాపతిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శివ్వంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాజ్యాంగ బద్ధమైన శాసనసభాపతి పదవికి గౌరవం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.శాసనసభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొంటూ తాత మధు, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. తాత మధును ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బొజ్జ తండాలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం అనంతరం శివ్వంపేట మండలం బొజ్జ తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడితే ఏదైన సాధించవచ్చు..!

**సంగారెడ్డి తెలంగాణ మంజీరా న్యూస్**

జగ్గారెడ్డిని కలిస్తే సమస్య తీరుతుందనే నమ్మకంతో పది రోజులు కష్టపడి త్రెడ్ ఆర్ట్ తో చిత్రపటాన్ని గీసిన విద్యార్థిని భవాని తన తల్లిదండ్రులకు చెందిన రెండున్నర ఎకరాల భూమి సమస్య రెవెన్యూ అధికారుల వద్ద ఉందని, అది పూర్తయితే ఆగిపోయిన తన చార్టెడ్ అకౌంటెంట్ చదువు కొనసాగిస్తానని జగ్గారెడ్డికి వివరించిన భవాని జగ్గారెడ్డి కి చిత్ర పటాన్ని బహూకరించిన భవాని సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కలిసి మీ సమస్యలను పరిష్కరిస్తానన్న జగ్గారెడ్డి హామిచ్చారు.

# లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్

## రాజీయే రాజమార్గం.. లోక్ అదాలత్ తీర్పు..!

## జూనియర్ సివిల్ జడ్జి ఎం. హేమలత

**నర్సాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్**

మెదక్ జిల్లా నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు, జాతీయ లోక్ అదాలత్ శనివారం సెప్టెంబర్ 12 జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జూనియర్ సివిల్ జడ్జి కం చైర్మన్ ఎం.హేమలత మాట్లాడుతూ రాజీయే రాజమార్గమని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పన్నారు. అదేవిధంగా రాజీ చేయదగిన కేసుల్లో ఇరువర్గాలు పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకొని స్నేహ పూరిత భావంతో కలిసిమెలిసి ఉండాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వెలువడే తీర్పు అంతిమ తీర్పుగా పరిగణించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు ఏ జి పి డి.శ్రీధర్ రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ గౌడ్, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ శాస్త్రుల మధుశ్రీశర్మ, లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్, కౌడిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అమరేందర్ రెడ్డి, చిలప్ చెడ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నర్సింలు, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సీనియర్ న్యాయవాది ఆర్.శ్రీనివాస్ రెడ్డి, ఈ.సత్యనారాయణ, సి.హెచ్.స్వరూపరాణి, పి.సుధాకర్, న్యాయవాదులు నాగరాజు,జాట్రోత్ రవినాయక్, ఏ.సాయిరాం, బి. మానయ్య, నీలవేణి, కోర్టు సూపర్డెంట్ ఎం.ఎల్. సూర్య ప్రకాష్, లీగల్ సర్వీస్ టైపిస్ట్ కం అసిస్టెంట్ కే.సుభాష్, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీస్ కోర్టుసిబ్బంది, కోర్టు పోలీస్ కానిస్టేబుల్స్, హరిబాబు గౌడ్, దిలీప్ గౌడ్, శ్రీనివాస్, ఆనంద్, కక్షిదారులు పాల్గొనడం జరిగింది. లోక్ అదాలత్ లో పలు కేసులను పరిష్కరించడం జరిగింది.

# మట్టి విగ్రహాలను పూజిదాం... ప్లాస్టిక్, కెమికల్ విగ్రహాలు వద్దు

## తోపాజి అనంత కిషన్

**సంగారెడ్డి**

**తెలంగాణ మంజీరా న్యూస్**

వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంలో తోపాజి అనంత కిషన్ ఆదివారం మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మట్టి విగ్రహాలని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని, ప్లాస్టిక్, కెమికల్ విగ్రహాలను వాడరాదని, మట్టి విగ్రహాల వైపు ప్రజలు చూస్తున్నారు.

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**సంగారెడ్డి తెలంగాణ మంజీరా న్యూస్**

రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా సామరస్య వాతావరణంలో పండగను ఘనంగా నిర్వహించుకోవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ వినాయక మండపం నిర్వాహకులందరూ అవసరమైన సమాచార ఫారమ్‌లు సంబంధిత పత్రాలను తెలంగాణ పోలీసు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు పలు భద్రతా జాగ్రత్తలు ముఖ్యమైన సూచనలు అందజేశారు గణేష్ ఉత్సవాల నేపథ్యంలో శాంతి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుండి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని, మండపాల వద్ద విద్యుత్, అగ్ని ప్రమాదాల నివారణకు తగిన భద్రతా చర్యలు చేపట్టాలి మండపాల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధిక శబ్దంతో డీజేలు/సౌండ్ సిస్టమ్స్ వినియోగించకుండా, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించాలని, ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నినాదాలు, పాటలు లేదా చర్యలకు పాల్పడరాదని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా లేదా ప్రచారం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలి ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని, నిమజ్జనం సమయంలో నిర్వాహకులు వాలంటీర్లు పోలీస్ సిబ్బందికి పూర్తిగా సహకరించాలని, మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడం, గొడవలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని పోలీస్ అధికారులు నిర్వాహకులను కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

## వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలతో సమావేశం

## జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. శనివారం జిల్లా జెడ్.పి. కార్యాలయంలో వివిధ కుల, మతాలకు చెందిన పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రజలు ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవిస్తూ మత సామరస్యాన్ని కాపాడాలని అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేలా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల వారీగా వివిధ మతాలకు చెందిన పెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పాటలు, వ్యాఖ్యలు చేయకూడదని, తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండేలా యువతకు సూచించాలని అన్నారు. ఈ పోర్టల్ ద్వారా మండపం వివరాలు, నిమజ్జనం తేదీ, నిమజ్జనానికి వెళ్లే మార్గం తదితర వివరాలను ముందస్తుగా నమోదు చేయాలని సూచించారు. వినాయక ప్రతిష్ఠాపన కోసం ఏర్పాటు చేసే మండపాలను రహదారులపై నిర్మించకుండా ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతా దృష్ట్యా ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏలాంటి పరిస్థితుల్లోనూ అధిక శబ్దంతో కూడిన లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని, నిబంధనలకు అనుగుణంగా మైకులు, స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేస్తే మండప నిర్వాహకులతో పాటు డీజే యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యంగా యువత సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ లేని ఫార్వర్డ్ మెసేజ్‌లను ఇతరులకు పంపకుండా జాగ్రత్త వహించాలని ఎస్పీ సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఇబ్బంది కలగకుండా అత్యవసర లైట్లను అందుబాటులో ఉంచుకోవాలని, మండపాల వద్ద వీడియో రికార్డింగ్ కోసం సీసీటీవీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, గణేష్ మండపాల వద్ద లక్కీ డ్రాలు నిర్వహించడం లేదా బలవంతంగా చందాలు వసూలు చేయడం చేయరాదని, గణేష్ మండపాల వద్ద మత్తు పదార్థాలు సేవించడం, జూదం ఆడటం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, గణేష్ మండపాల వద్ద ఇసుక బస్తాలు, నీటి డ్రమ్ములు తదితర అగ్నిమాపక, అగ్ని నిరోధక సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని, రాత్రి సమయంలో తనిఖీ కోసం వచ్చే పోలీసు అధికారులకు మండప నిర్వాహకులు, వాలంటీర్లు పూర్తిగా సహకరించాలని, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భారీ పరిమాణంలో విగ్రహాలను ఏర్పాటు చేయడం వల్ల నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, విగ్రహాల పరిమాణంలో సాధ్యమైనంతవరకు పరిమితులు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో లేదా ఏదైనా సమాచారం ఉన్నప్పుడు డయల్-112కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెంటనే సమాచారం అందించాలని కోరారు.

# ముప్పిరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి సస్పెండ్

## కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యమే కారణం

## మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ చర్యలు

**మనోహరాబాద్, సెప్టెంబర్ 12, తెలంగాణ మంజీరా ప్రతినిధి:**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి ప్రియాంకను జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సస్పెండ్ చేశారు. కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు మనోహరాబాద్ ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రియాంక గతంలో కాళ్లకల్ గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన సమయంలోనూ ఇదే తరహాలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై పాలకవర్గం, గ్రామస్తులు రెండు పర్యాయాలు గ్రామసభలో చర్చించినట్లు సమాచారం.

ప్రస్తుతం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో గృహ నిర్మాణానికి సంబంధించిన అంశంలో కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఆమె నిర్లక్ష్యం వహించినట్లు అధికారులు గుర్తించారు. కోర్టు ఆదేశాలను పాటించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.కోర్టు ఆదేశాల అమలులో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదనే సంకేతంగా ఈ సస్పెన్షన్ చర్యను అధికారులు పేర్కొంటున్నారు.

# మనోహరాబాద్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా మేడ్చల్ రామస్వామి ఎన్నిక.

**మనోహరబాద్, సెప్టెంబర్ 12. (తెలంగాణ మంజీరా) ప్రతినిధి**

మనోహరాబాద్ మండల ఎస్సీ సెల్ చైర్మన్ గా మేడ్చల్ రామస్వామి అధికారికంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యనారాయణ ఆదేశాల మేరకు అధికారికంగా ప్రకటించారు. వీరితోపాటు తూప్రాన్ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా సర్గల వినీత్ కుమార్ ఎన్నికయ్యారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని మనోహ రెస్టారెంట్ వద్ద వీరి ఇరువురికి అధికారికంగా నియామాక పత్రాన్ని రాష్ట్ర నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి, రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ తాడేపు మహేందర్ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మాకు ఇచ్చిన ఈ పదవిని సొంత లాభాపేక్ష కోసం కాకుండా పార్టీకి అహర్నిశలు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి, తూప్రాన్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ అధ్యక్షులు గరిగే నరసింగారావు, అధికార ప్రతినిధి సత్యనారాయణ, నాయకులు చిట్టి మిల్ల అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల నరసింహ, టేక్మాల్ వెంకట్ రెడ్డి, నాగరాజు గౌడ్, మైనార్టీ అధ్యక్షులు జావేద్ పాషా, వెన్నెల్లి కృష్ణ, బక్క శ్రీనివాస్, వి. వెంకట్ రెడ్డి, ఎస్. కిట్టు, రేకల నయాందాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గణేశ నవరాత్రుల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం

**తూప్రాన్ సెప్టెంబర్ 12:-**

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ఈరోజు తూప్రాన్ పట్టణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ...గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.శాంతి భద్రతలు,మత సామరస్యం,ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు మరియు ఇతర శాఖల అధికారులకు సహకరించాలని కోరారు.ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొంది రజనీ రవిందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్,ఎంఆర్వో చంద్రశేఖర్ రెడ్డి,విద్యుత్ శాఖ అధికారులు ఏఈ వెంకటేశ్వరరావు మున్సిపల్ వైస్ చైర్మన్ సమత కాశీ రెడ్డి,కౌన్సిలర్లు రాథోడ్ జైపాల్ నాయక్,బైరం సత్యలింగం,చెలిమెల రాములు, అన్నపూర్ణ నారాయణ గుప్త , సబిత నాగేష్, వేణు ఐలేష్ యాదవ్,బొడ్డు రాధా శ్రీనివాస్,చంద అశోక్,మన్నె స్వామి,స్వప్న నాగరాజు గౌడ్, జ్యోత్స్న వేణు, వినాయక మండపం కమిటీ సభ్యులు ప్రభుత్వ అధికారులు , పోలీస్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తోరణాలు కట్టారా..? మండపాలు తీర్చిదిద్దారా..?

## హిందువుల ఆత్మీయ పూజలందుకునేందుకు వేళయింది!

## తూప్రాన్ లో అంబరాన్నంటిన గణనాథుడి ఆగమనం

**తూప్రాన్, సెప్టెంబర్ 12, తెలంగాణ మంజీరా ప్రతినిధి**

“గణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా..” అంటూ భక్తుల నినాదాలు.. అడుగడుగునా విద్యుత్ దీపాల కాంతులు.. యువత ఉత్సాహం.. భక్తుల సందడి.. డీజే పాటల హోరు.. వీటన్నింటి మధ్య తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో విఘ్నేశ్వరుడి ఆగమనం అంగరంగ వైభవంగా జరిగింది.

వినాయక చవితి పర్వదినానికి ముందే తూప్రాన్ లో స్టార్ వాల్ గణనాథుడి ఆగమన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీరిన గణనాథుడిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణలు, భక్తి గీతాలు, యువత సందడి మధ్య గణనాథుడి శోభాయాత్ర ఉత్సాహభరితంగా సాగింది.

గణనాథుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తూప్రాన్ పట్టణ వీధులు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. యువత, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇంటింటా భక్తి..

గల్లీ గల్లీలో గణేశ్

“తోరణాలు కట్టారా..? మండపాలు తీర్చిదిద్దారా..? ఇక విఘ్నేశ్వరుడి ఆత్మీయ పూజలకు సిద్ధమయ్యారా..?”

వినాయక చవితి సమీపిస్తుండటంతో పట్టణాలు, పల్లెల్లోని ప్రతి వీధి గణనాథుడి నామస్మరణతో మార్మోగుతోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు గణపతి ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గల్లీ గల్లీలో ఏర్పాటు చేస్తున్న మండపాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.. విద్య, జ్ఞానం ప్రసాదించే వినాయకుడు.. శుభకార్యాలకు ఆదిదేవుడైన గణపతి కొలువుదీరనున్న వేళ ప్రతి ఇంటా ఆధ్యాత్మిక శోభ నెలకొంటోంది.గల్లీ కా గణేశ్.. చరిత్ర ఇదే!గణేశ్ ఉత్సవాలకు ఒక గొప్ప చారిత్రక నేపథ్యం ఉంది. 1893లో లోకమాన్య బాలగంగాధర తిలక్ సార్వజనిక గణేశ్ ఉత్సవాలకు నాంది పలికారు. ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువతను ఒకతాటిపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో గణేశ్ ఉత్సవాలను సామూహిక వేడుకగా తీర్చిదిద్దారు.కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఒకచోట చేరి గణపతి ఉత్సవాలను నిర్వహించే సంప్రదాయం క్రమంగా విస్తరించింది. అనంతరం హైదరాబాద్‌లోని శాలిబండ ప్రాంతంలో కూడా గణేశ్ ఉత్సవాలు నిర్వహించబడినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఆ తరువాత గణేశ్ ఉత్సవాల వైభవం దేశవ్యాప్తంగా విస్తరించింది.

భక్తి.. ఐక్యత.. సేవకు ప్రతీకనేడు గణేశ్ ఉత్సవం కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాదు. ప్రజలను ఏకం చేసే ఆధ్యాత్మిక వేదిక.. యువత లో సేవాభావాన్ని పెంపొందించే సందర్భం.. సామాజిక ఐక్యతకు ప్రతీక. మండపాల వద్ద అన్నదానాలు, భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ గణనాథుడి సేవలో భక్తులు తరించేందుకు సిద్ధమవుతున్నారు. వినాయకుడి ఆగమనంతో పల్లె నుంచి పట్టణం వరకు భక్తి పరిమళాలు వెదజల్లుతున్నాయి.మరో రెండు రోజుల్లో.. సోమవారం కలుద్దాం!మండపాలు సిద్ధమయ్యాయా..?తోరణాలు కట్టారా..?గణనాథుడి పూజకు అంతా సిద్ధమేనా..?మరో రెండు రోజుల్లో.. సోమవారం..భక్తి, శ్రద్ధ, ఆనందాల మధ్యవిఘ్నేశ్వరుడి సన్నిధిలో కలుద్దాం!లిలిగణపతి బప్పా మోరియా.. మంగళమూర్తి మోరియా..విఘ్నాలు తొలగించి.. శుభాలు ప్రసాదించు గణనాథా!లిలి